మానవ జీవితంలో కొన్ని సందర్భాల్నీ, కొంతమంది మనుషుల్నీ, కొన్ని విచిత్రమైన పరిస్థితుల్నీ, ఊహకందని వ్యక్తిత్వాల్నీ, మనస్తత్వాల్నీ చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. రోజూ కొన్ని వందల కొత్త కొత్త ముఖాల మధ్యన గత పదేళ్ళుగా ప్రయాణం చేయడం ఉద్యోగరీత్యా నాకు తప్పనిసరైపోయింది. ఈ నిత్య ప్రయాణంలో మెరుపులు, మలుపులు, మనకలు, మజిలీలు ఎన్నెన్నో!

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది.

రాయగడ రైల్వేస్టేషన్‌లోకి అడుగుపెట్టాను. అప్పటికే ప్లాట్‌ఫారమ్ మీద విశాఖపట్నం వెళ్ళే రాయపూర్ పాసింజర్ సిద్ధంగా ఉంది. అలవాటుగా

"రైల్లో పనిచేస్తున్నంతమాత్రాన మన గదమాయింపులకు రైలు ఆగుతుందేవిటే. జాగ్రత్తగా వెతుకూ. నీకసలే మతిమరుపు." వినుక్కుంటూ అభిమన్యుడి మేనమామలా ముందుకు దూసుకెళ్తున్నాడు విష్ణుశర్మ.

అయిదు నిమిషాల సేపు అంతా గందరగోళం.

"బాగా జ్ఞాపకం చేశారు. మరిచేపోయాను. చంటోడు బాత్‌రూమ్‌కి వెళ్తానంటే కూర్చోపెట్టి వచ్చానండోయ్. జాడీ మీరన్నట్లు పైట చాటునే ఉందండోయ్. మీరక్కడ ఎవర్ని చూస్తూ ఉండిపోయారు. వేగిరం రండి" అంటూ సీట్లోంచి లేచి చంటోణ్ణి తీసుకురావడానికి ముందు కెళ్ళిందావిడ.


"ఐస్‌క్రీమ్ ఐస్‌క్రీమ్. నిమిషాల్లో వేడి తగ్గించే ఐస్‌క్రీమ్..."

"అమ్మలారా. వ్రతమహాత్మ్యాల కథల పుస్తకాలమ్మా. అష్టలక్ష్మీ వ్రతం, దుర్గాదేవి వ్రతాల పుస్తకాలమ్మా. కొనండమ్మా కొనండి. చదవండి, తరించండి. రెండు పుస్తకాలు కొన్నవారికి మూడో పుస్తకం ఉచితం..."

వివిధ రకాల అమ్మకాలదార్లతో కంపార్ట్‌మెంట్ హోరెత్తిపోతోంది.

"రెండు ముక్కలుగా ఉన్న హైదరాబాద్‌ని మూడు ముక్కలు చేసేస్తున్నారండీ బాబూ. చాలా

# మనుషుల బండి



**అంతా డబ్బుమయమైపోయిన ఈ వ్యాపార సమాజంలో దయ, ధర్మం కూడా పెట్టుబడి సరకులుగా మారాయి. ఎదుటివాళ్ళను మభ్యపెట్టి వారి కనికరాన్ని సొమ్ము చేసుకోవడం వ్యాపార సూత్రమైంది**

జనరల్ కంపార్ట్‌మెంట్ ఎక్కి, సీటు కోసం అటూ ఇటూ చూస్తున్నాను. ఇవాళెందుకో రైలంతా రష్‌గా ఉంది. కంపార్ట్‌మెంట్ కూడా చిన్నసైజు వింత ప్రపంచంలా ఉంది.

శని, ఆదివారాలు సింహాచలంలో నరసింహస్వామి దర్శనానికి భక్తులు ఎక్కువమంది వస్తారు. అందుకే ఈ రద్దీ ఏమో. డోర్ పక్కన, సింక్ దగ్గర నించున్నాను. ఎక్కువ మంది ఒరియా ప్రయాణీకుల అరుపుల్తో కంపార్ట్‌మెంట్ కోలాహలంగా ఉంది. సిగరెట్ వెలిగించుకుందామన్నా సందు దొరకని రద్దీ.

"ముందుకు నడవవయ్యా బాబూ. గేటు దగ్గర టికెట్ కలక్టర్లా నుంచున్నావ్. పద పద..." యాభై ఏళ్ళ మగమనిషి ఒరియా యాసతో తెలుగుని ఉచ్చరించి, "మా ఫామిలీస్, పిల్లలు కూడా బండెక్కుతున్నారు దారివ్వండి" అని గట్టిగా అనౌన్స్ చేసి, రెండు చేతుల్లోని రెండు బుట్టలతో మల్లయోధుడిలా లోనికి దూసుకుపోతున్నాడు.

"ఫామిలీయా, ఫామిలీసా?" ఓ కాలేజి కుర్రాడు అడిగాడు జోక్‌గా.

"ఫామిలీసే. అబద్ధం ఎందుకూ. నా కిద్దరు పెళ్ళాలయ్యా మగడా. నీ డౌటు తీరిందా." వెనక్కి కోపంగా చూస్తూ అన్నాడతను.

చుట్టుపక్కలున్న జనమందరూ ఒక్కసారిగా ఫెళ్ళున నవ్వారు. రైలు కూత పెట్టడం, నెమ్మదిగా కదలడం ప్రారంభమైంది.

"ఏవండీ. మన చంటోడు కనిపించడం లేదు. ఉసిరికాయ పచ్చడి జాడీ కూడా కనిపించడం లేదు." ఆ చివర నుంచి ఒక పెద్దావిడ భీకరంగా సప్తస్వరాలతో అరిచింది.

"చూడవే. జాగ్రత్తగా చూడు. సీట్లో కూర్చున్నావు గదా. నీ పైట చెంగు చాటునో, కాళ్ళ పక్కనో చూడు." ఈ చివర జనం మధ్యలో చిక్కుకుపోయిన విష్ణుశర్మ అరిచాడు.

"నా పైట చెంగు చాటున ఉండడానికి మీరా ఏవిటి, చంటోడు. ముందు కేకేసి రైలాపించండి." మళ్ళీ అరిచిందావిడ.

"ఓలి సూరమ్మా. ఏటనాగ ఎళిపోతావ్. ఇక్కడ... ఇక్కడ కిటికీ కాడున్నాను. బేగిరా." ఆముదాలవలస నాయుడు అరిచాడు.

సూరమ్మ అనే ముప్పై ఏళ్ళ పల్లెటూరి ఆడమనిషికి ఆ సమయంలో చాలా చికాగ్గా ఉంది. అలవాటుకొద్దీ ఆవిడ జాకెట్టు వేసుకోలేదు. ఒక పక్క జారిపోతున్న పైట చెంగుతో ఎత్తయిన గుండెలను కప్పుకోవడానికి ప్రయత్నం చేస్తూ కాలేజీ కుర్రాళ్ళ మధ్యనుంచి ముందుకెళ్ళడానికి ఉక్కిరిబిక్కిరైపోతోందామె.

"ఏటి. నానిక్కడ ఆటాడతన్నానేటి. కిక్కిరిసిపోనారు జనం. వస్తన్నాను గందా" అంటూ, "తప్పుకో బాబూ. మా నాయుడు దగ్గరికెళ్ళాలి." కుర్రాళ్ళ మధ్యనుంచి నడుస్తోందామె.

"ఈ రష్‌లో నాయుడు దగ్గరికెళ్ళకపోతే ఏమవుతుంది? నాయురాలా, కాసేపు ఇక్కడుండు." ఓ చలాకీ కుర్రాడు హుషారుగా అన్నాడు దట్టంగా కాటుక దిద్దిన ఆ నాయురాలి కళ్ళవేపు చూస్తూ.

"ఏటా ఏళాకోళం. ఆ ఏళాకోళమేదో పెళ్ళయ్యాక నీ పెళ్ళాంతో ఆడుకో. దారివ్వు" అంటూ విసురుగా ముందుకు నడిచింది నాయురాలు.

"ఇంకా పెళ్ళి కాలేదులే. అందుకే..." ఆ చలాకీ కుర్రాడి జవాబుకి అక్కడున్న వాళ్ళందరూ సెక్సప్పీల్ ఉట్టిపడుతున్న నాయురాలి వేపు చూసి నవ్వారు.

"ఎక్స్యూజ్ మీ సర్. పేపర్లో సిటీ ఎడిషన్ ఇస్తారా." నా భుజాన్ని తట్టి అడిగిన వ్యక్తివేపు కొంచెం అసహనంగా చూసి, అతనడిగిన పేపర్ని ఇచ్చాను. అదే సమయంలో మరో ఇద్దరు వ్యక్తులు చనువుగా నా చేతిలోని మిగతా డైలీ పేపర్ని తీసేసుకుని సీరియస్‌గా చదవడం మొదలెట్టారు.

"టీ టీ, కాఫీ కాఫీ." గొంతు బిగపట్టి అరుస్తూ రైల్వే క్యాంటీన్ కుర్రాడు జనం మధ్యలోకి ప్రవేశించాడు.

"వేరుసెనగకాయలే. ఉడకబెట్టిన వేరుసెనగ కాయలే..."

"బఠానీ బఠానీ. వేడివేడి బఠానీ..."

అన్యాయం." నా పేపర్ని తీసుకుని పది నిమిషాల సేపు సీరియస్‌గా తిరగేసిన వ్యక్తి, పక్కనున్న వ్యక్తితో కంగారుగా అన్నాడు.

"హైదరాబాద్, సికిందరాబాద్ కదండీ. మూడు ముక్కలుగా చెయ్యడం అంటారేవిటి?" సదరు వ్యక్తి ఆశ్చర్యానంద స్వామిలా అడిగాడు. "మీకు పేపర్లవీ చదవడం అలవాటు లేదులా ఉంది. దేశంలో ఎన్ని ప్రమాదాలు జరిగిపోతున్నాయో మీకేం తెల్సు"

అన్నాడతను చికాగ్గా.

"ఏవిటండీ ఆ డేంజర్స్?"

"అదేనండీ. హైదరాబాద్ సిటీ, సికిందరాబాద్ సిటీ. ఇప్పుడు కొత్తగా హైటెక్ సిటీ అట. జంట నగరాలు మూడు నగరాలయ్యాయండీ బాబూ. జనాభా అండీ బాబూ జనాభా. జనాభా పెరిగిపోతుంటే, మహానగరాలు ఎన్ని ముక్కలైనా అయిపోతాయి." ఆ వ్యక్తి తెగ బాధపడిపోతున్నాడు.

"హైటెక్ సిటీ అంటే?" ఎవరో తెల్సిన వ్యక్తి ఏదో చెప్పబోయాడు. అతన్నెవరూ పట్టించుకోలేదు.

వింత వింత సంచార జాతి వ్యక్తులు చేసే

చిత్రాలు: నర్సిం



ప్రయాణంలో మధ్యలో ఇరుక్కుపోయినట్లుగా ఉంది నాకీ ప్రయాణం. ఇరవై నిమిషాల తర్వాత చీపురుపల్లి స్టేషన్‌లో రైలాగింది.

కంపార్ట్‌మెంట్‌లోంచి కిందకు దిగి సిగరెట్ వెలిగించుకుని, జనసమ్మర్దం వేపు చూస్తున్నాను.

సరిగ్గా ఆ సమయంలోనే -

అదరాబాదరాగా స్టేషన్‌లోకి వచ్చింది ఆ అమ్మాయి. ఆ అమ్మాయికి పాతికేళ్ళ వయసుంటుంది. మరీ పొట్టి కాదు, పొడుగూ కాదు. చామన ఛాయ శరీరపు రంగు. బెంగాలీ కాటన్ చీర కట్టుకుంది. వత్తయిన జడ. ఆ జడలో మెరుస్తున్న సంపెంగపువ్వులు. మెడలో నల్లపూసల దండ. ఒక చేతికి వాచీ. ఇంకో చేతికి గాజులు.

ఆమె భుజమ్మీద నిద్రపోతున్న ఆరు నెలల పిల్లాడు. ఆ పిల్లాడి ముఖం చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంది. ఆ పిల్లాడికి వేసిన కొత్త డ్రెస్సు నీరెండ వెలుగులో నిగనిగమని మెరుస్తోంది. ఉంగరాల జుత్తు. చిన్ని ఎర్రటి పెదాలు. పుష్టిగా, బలంగా టీవీ ఎడ్వర్‌టైజ్‌మెంట్స్‌లో కనిపించే బాబులా చాలా నాజూగ్గా ఉన్నాడు.

అటూ ఇటూ చూస్తూ ఆ అమ్మాయి నా పక్క నుంచే నడిచివెళ్ళి కంపార్ట్‌మెంట్ ఎక్కింది. రైలు కూత పెట్టగానే కంపార్ట్‌మెంట్ ఎక్కి నుంచున్నాను. నాకు కొంచెం దూరంలో ఆ అమ్మాయి నుంచుంది.

అందంగా ఉన్న ఆ అమ్మాయిని, అంతకన్నా అందంగా ఉన్న ఆమె భుజాల మీదున్న పిల్లాణ్ణి అందరూ చూస్తున్నారు.

రైలు గరివిడి ఫ్యాక్టరీ దాటుతోంది.

"భుజమ్మీద బాబుతో ఎంతసేపు నిలబడతారు. ముందుకెళ్ళండి. సీటు దొరుకుతుంది" అన్నాను నేను.

"ఫర్వాలేదండీ." మొహమాటంగా అంది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయికి సీటునివ్వడం కోసం ఇద్దరు, ముగ్గురు కాలేజీ కుర్రాళ్ళు తమ త్యాగశీలతను వ్యక్తం చేశారు. ఆ అమ్మాయి మౌనంగా తిరస్కరించింది.

రైలు విజయనగరంలో ఆగి, పావుగంట తర్వాత బయలుదేరింది. నాకు సీటు దొరికింది. విష్ణుశర్మ భార్య పక్కన బాబును ఒడిలో పెట్టుకుని కూర్చుంది ఆ అమ్మాయి.

పావుగంట గడిచింది.

అప్పుడే నిద్రలోంచి లేచిన బాబు కళ్ళిప్పి, చుట్టూ ఉన్న జనాలను చూసి ఏడ్వడం ప్రారంభించాడు. ఆ అమ్మాయి వాణ్ణి సముదాయిస్తోంది. పక్కనున్న విష్ణుశర్మ భార్య ఆ బాబుని అందుకోగానే, ఆ ముఖంలోకి తేరిపార చూసిన బాబు ముఖంలో ఒక్కసారిగా ఏడుపు మాయమైపోయింది.

"బాబు పేరేం పేరు. అందంగా ఉన్నాడు. నవ్వు ముఖం. నీ పోలికా, మీ ఆయన పోలికా?" బాబు బుగ్గల్ని ముద్దాడుతూ విష్ణుశర్మ భార్య అడిగింది.

"ఆయన పోలికేనండీ." మెల్లగా జవాబు చెప్పి, ఆ అమ్మాయి ఎందుకో నలువేపులా చూస్తోంది.

"ఎక్కడకు వెళ్తున్నావ్?" అడిగిందావిడ.

"విశాఖపట్నమండీ."

"మీ ఆయనకు అక్కడ ఏ ఉద్యోగం?" ఆసక్తిగా అడిగిందావిడ.

ఆ అమ్మాయి తటపటాయిస్తూ ఇలా చెప్పింది.

"ఆయన లేరండీ. విశాఖపట్నం వెళ్ళేది బాబుని కె.జి.హెచ్‌లో చూపించడానికి." చుట్టుపక్కల వ్యక్తులందరూ ఆమె చెప్తున్న మాటల్ని చాలా జాగ్రత్తగా వింటున్నారు. దానిక్కారణం ఆ అమ్మాయి అందమైన ఆకర్షణే!

"ఆస్పత్రికా. ఏమైందీ పాపం?" బాబు కళ్ళల్లోకి చూస్తూ జాలిగా అడిగిందామె.

"మాది రాయగడ అండీ. రెన్నెల్ల క్రితం వీళ్ళ నాన్న కారు ఏక్సిడెంట్‌లో చనిపోయారండీ. వారం రోజుల క్రితం వరకూ వీడు బాగానే ఉన్నాడండీ. సడన్‌గా ఏమైందో ఏవిటో ఉలుకూ పలుకూ లేకండా కళ్ళు తేలేసి, సొమ్మసిల్లిపోయాడు. రాయగడలో డాక్టర్‌కి చూపించాను. కె.జి.హెచ్‌కి అర్జంటుగా తీసికెళ్ళిపోమన్నారు. అక్కడికి తీసికెళ్ళి చూపించాను. గుండెలో కన్నం పడిందట. వెంటనే మందులిచ్చి వారం రోజుల్లో ఆపరేషన్ చెయ్యకపోతే బతికి బట్టకట్టడం కష్టమని చెప్పారు. ఏం చెయ్యాలమ్మా. నాకెవరున్నారని, నా కష్టాన్ని ఎవరితో చెప్పుకోను. అమ్మా, నాన్న చిన్నప్పుడే చనిపోయారు. ఉన్న ఒక్కగానొక్క అన్నయ్య బొంబాయిలో ఉంటున్నాడు. వాడు నన్నెప్పుడో మర్చిపోయాడు. వీడికి ఆపరేషన్ చెయ్యాలంటే పదివేలు అవుతుందట. అంత డబ్బు ఆడదాన్ని నేనెక్కడ నుంచి తెస్తాను. తెల్సిన వాళ్ళనీ బతిమిలాడి మూడు వేలు పోగు చేశాను. ఆ డాక్టర్ బాబు కాళ్ళు పట్టుకుని, ఆపరేషన్ చేయించడానికి బయలుదేరానండీ." విషాదస్వరంతో చెప్పి, పైట చెంగుతో కళ్ళొత్తుకుంటూ అంది ఆ అమ్మాయి.

చుట్టుపక్కల ప్రయాణికులు జాలి జాలిగా ఆ బాబు వేపే చూస్తున్నారు.

> రైలు గరివిడి ఫ్యాక్టరీ దాటుతోంది. "భుజమ్మీద బాబుతో ఎంతసేపు నిలబడతారు. ముందు కెళ్ళండి. సీటు దొరుకుతుంది" అన్నాను నేను.

విష్ణుశర్మ భార్య నలువేపులా ఒకసారి చూసి, భర్తవేపు కూడా చూసింది. భార్య చేతుల్లో ఉన్న బాబుని విష్ణుశర్మ తన చేతుల్లోకి తీసుకుని, మిలమిలా మెరుస్తున్న బాబు కళ్ళల్లోకి చూస్తూ-

భగవంతుడు రాయో, రప్పో, మన్నో, మానో అనుకున్నాను గానీ, వాడు కూడా మనలాంటి మనిషేనని, మనిషికుండే ఈర్ష్యాసూయలకు వాడేమీ అతీతుడు కాడని ఇలాంటి సంఘటనల వల్ల తెలుస్తోందమ్మా. లేకపోతే ఈ ఘోరం ఏమిటి? ఈ అమానుషత్వం ఏమిటి? అందమైన పువ్వుని సృష్టించి, దానిని తినడానికి పురుగును సృష్టించినట్టుగా, దబ్బపండు లాంటి ఈ బిడ్డను నీకివ్వడమేమిటి? ఇస్తూ ఇస్తూ వాడి లేత గుండెల్లో రంధ్రం పెట్టడమేమిటి? బాధపడకమ్మా బాధపడకు. నీ బాబుకి నయమై పోతుంది. బాధపడకు" అంటూ బాబుని ఆమె చేతికందించాడు.

ఆయన మాటలు అక్కడున్న వారందరి మనసుల్నీ కదిలించివేశాయి.

"అమ్మాయ్! ఎవరైనా సహాయం చేస్తే తీసుకుంటావా తల్లీ?" విష్ణుశర్మ భార్య మాతృ హృదయంతో అడిగింది.

"ఎవర్ని ఏరకంగా అడగాలను చెప్పండి. పుట్టింది పెద్ద పుట్టుక. ఆయన పెద్ద ఉద్యోగం చేసినా, మాకేవీ మిగల్చకండా పోయారు. వీడికి పూటకు పాలు కొని పట్టడానికే గగనంగా ఉంది. 'దేహీ' అని చెయ్యి సాచాలంటే మొహమాటం. వీడు తప్ప నాకీ ప్రపంచంలో ఏ ఒక్కరూ లేరు. వీణ్ణి చంపి, నేను చావడ మొక్కటే నాకు మిగిలింది." దుఃఖం పూడుకుపోతున్న గొంతుతో అందామె.

ఆ సంభాషణని ఆసక్తిగా వింటున్న ఎదురుగా కూర్చున్న ఒరియా వ్యక్తి-

"అదేంటండీ అలా బాధపడతారు. చిన్న పిల్లలు దేవుడితో సమానం. ఈ ప్రపంచంలో మానవత్వం ఇంకా మాసిపోలేదు. మేమూ మనుషులమే. మాకూ కష్టసుఖాలొస్తాయి. ఏదో నాకు తోచిన సహాయం. కాదనకండి" అంటూ జేబులోంచి వందరూపాయల

నోటును తీసి ఆ అమ్మాయి చేతికందించాడు.

"థ్యాంక్సండీ" అంటూ కృతజ్ఞతగా అతని కళ్ళల్లోకి చూసి, ఆ నోటుని జాకెట్లో పెట్టుకుంది.

విష్ణుశర్మ భార్య మనీపర్స్‌లోంచి ఓ నాలుగు యాభై రూపాయల నోట్లను తీసి ఆ అమ్మాయికిస్తూ-

"చూడమ్మాయ్. వాడికి వెంటనే ఆపరేషన్ చేయించు. రాయగడ రైల్వే క్వార్టర్స్‌లోనే మేవుండేది. విష్ణుశర్మ గారంటే మా పెద్ద పేరులే. ఆపరేషన్ అయ్యాక ఓ మాట నా చెవిన వెయ్యి. మీ ఇంటి కొచ్చి ఈ బుడతణ్ణి చూస్తాను. సరేనా" అందామె.

"మీ సహాయాన్ని మరచిపోలేనండీ." ఆ డబ్బును తీసుకుంటూ అందా అమ్మాయి.

"ఇదుగో! మూడొందలు ఇలా ఇవ్వండి." పట్టుచీర, పట్టు జాకెట్టుతో తళతళలాడిపోతున్న ఒకావిడ ఎదురుగా కూర్చున్న భర్తని అడిగింది.

"మూడొందలా, ఎందుకూ?" నల్లటి కళ్ళద్దాల లోంచి జాకెట్ లేకుండా పైట కప్పుకున్న పల్లెటూరి నాయురాలి వేపే కన్నార్పకుండా చూస్తున్న ఆ భర్త, తల తిప్పకుండానే వినుగ్గా ప్రశ్నించాడు.

"ప్రశ్నలు వెయ్యకండి, బావోదు. ఇమ్మన్నానా." నెమ్మదిగా గదమా యించింది.

"ఆ డబ్బును ఎందుకు పట్టుకెళ్ళ న్నామో తెలుసా?" భార్య ఆంతర్యాన్ని గ్రహించిన ఆ భర్త కొంచెం కోపంగా అన్నాడు.

"మనమ్మాయి పురిటి ఖర్చు కోసం పట్టుకెళ్తున్నావని నాకు తెల్సుగానీ, ముందు మూడు వందలివ్వండి. అంతగా చాలకపోతే అక్కడ ఎవరి దగ్గరైనా తీసుకుందాం లెండి. అంతా వింటున్నారు కదా. నోరూ, వాయీ లేని పిల్లాడికి కష్టం వచ్చింది. మన పిల్లాడైనా, పరాయి పిల్లాడైనా, పిల్లాడు పిల్లాడే. అందరూ ఇస్తున్నారు కదా" అంటూ భర్త జేబులో చెయ్యిపెట్టి, కొంత డబ్బు తీసి లెక్కపెట్టి, మిగతా నోట్లని ఆ జేబులో పెట్టేసి -

"మా వంతు సాయం. ఉంచమ్మా" అంటూ లేచి ఆ డబ్బును ఆ అమ్మాయి కిచ్చింది.

మౌనంగా ఆ డబ్బును తీసుకున్న ఆ అమ్మాయి, కళ్ళతోనే కృతజ్ఞతలు తెలిపింది.

ఆమదాలవలస నాయుడితో ఆ నాయురాలు ఏం చెప్పిందో తెలీదు. నాయుడు మాట్లాడకుండా నూటయాభై రూపాయలు తీసి ఆ అమ్మాయి చేతిలో పెట్టాడు.

ఆ చివరి నుంచి ఈ చివరి వరకూ కంపార్ట్‌మెంట్లో ప్రయాణికుల టాపిక్ అంతా ఆ అందమైన నెలల బాబు ఆపరేషన్ మీద, వాళ్ళమ్మ దయనీయమైన జీవిత కథ మీద ఉంది.

కాలేజీ కుర్రాళ్ళు, కొంతమంది ఉద్యోగస్థులు, మరి కొంతమంది మధ్యతరగతి మహిళలు, పల్లెటూరి పడుచులు అందరూ అప్పటికప్పుడు చందాలు వేసుకుని కొంత డబ్బును ఆ అమ్మాయికి అందించారు.

ఆ డబ్బు సుమారు రెండు వేలు దాటి ఉంటుంది.

"సూడు తల్లీ, ఏ పేగుకి పుట్టినా బిడ్డ బిడ్డే. తల్లీ, తండ్రీ లేరంటున్నావ్. మొగుడు ఈ మధ్యనే పోనాడంటున్నావ్. కష్టాలొస్తే అన్నీ కలిసే వస్తాయి. సూడు తల్లీ నేనో గొడ్రాలిని. కానీ, నా మనసు గొడ్రాలిది కాదు. బంగారం నాంటి నీ కొడుక్కి ఆపరేషన్ సేయించు. నా ఇల్లు డాబాల కొత్తాల్స కాడ పాత బస్టాండ్ దగ్గర. కూరగాయల సిట్టెమ్మంటే ఎవరైనా సెప్తారు. పిల్లాడితో పాటు ఎప్పుడైనా నా ఇంటికి రా. ఓ పూట నా ఇంట్లో ఉండి ఎల్దువుగానీ. ఇదిగో ఇదుంచు" అంటూ ఆ కూరగాయల చిట్టెమ్మ, ఆ రోజు కూరగాయలు అమ్మిన డబ్బుని చిల్లర పైసల్తో సహా ఆ అమ్మాయి చేతిలో పెట్టింది.

ఆ దృశ్యం మానవతా స్పర్శకు మణిదీపంలా ఉంది.

"అలాగే అమ్మా. మీ మేలు ఈ జన్మలో మరిచిపోలేను" అంది ఆ అమ్మాయి.

రైలు కోరుకొండ, అలమండ, కొత్తవలస, పెందుర్తి, గోపాలపట్నం స్టేషన్ల మీదుగా విశాఖపట్నంలో ఆగింది. ఆ అమ్మాయికి ఏదైనా సహాయం చెయ్యాలని నాకూ అనిపించింది. కానీ, నా దగ్గర పాతిక రూపాయలు మాత్రమే ఉన్నాయి. నాకు గిల్టీగా ఉంది.



రైలు దిగి ప్లాట్‌ఫారం చివరి వరకూ వెళ్ళి, బ్రిడ్జి ఎక్కి మెయిన్ గేట్ వేపు వెళ్తున్న ఆ అమ్మాయి వేపే చూస్తూ, రైల్వే క్యాంటీన్ వేపు నడిచాను.

వెలుగు నెమ్మనెమ్మదిగా తరిగిపోతూ చీకటిని ఆహ్వానిస్తున్న నిరంతర ప్రకృతి ప్రక్రియ.

రైల్వేస్టేషన్లో దీపాలు వెలిగాయి.

నెమ్మదిగా టీ తాగి, సిగరెట్ వెలిగించుకుని, స్టేషన్ లోంచి బయటికొచ్చి, బస్టాప్ వేపు నడుస్తున్నాను.

నా ఆలోచనలనిండా ఆ అమ్మాయే. ముద్దొచ్చే ఆ బాబే.

బస్టాప్‌లో అరగంట నిలబడ్డాక గానీ గాజువాక వెళ్ళే సిటీ బస్సు దొరకలేదు.

ఇరవై నిమిషాల తర్వాత గాజువాక జంక్షన్‌లో బస్సాగింది. దిగి పాత గాజువాక వేపు నడుస్తున్నాను.

కొత్త గాజువాక, పాత గాజువాక మధ్యనున్న వంతెన చీకట్లో చిత్రంగా మెరుస్తోంది. అక్కడ వీధి దీపాలు పగలంతా నిరాఘాటంగా వెలిగి రాత్రయేసరికి ఎందుకో ఆరిపోతాయి.

వంతెన దాటాక జంక్షన్‌లో అప్పటికే ట్రాఫిక్ జామ్ అయింది.

ఆ జంక్షన్‌కి అటూ, ఇటూ పేదవాళ్ళ గుడిసెలున్నాయి.

అక్కడ ఎప్పుడూ ఏదో ఒక గొడవ జరగడం, గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అయిపోవడం మామూలే.

వరుసగా కార్లు, లారీలు, సిటీబస్సులు, ఆటోలు, స్కూటర్లు అన్నీ ఆగిపోయాయి.

"ఏవైందండీ. యాక్సిడెంటా?" ఎవరో ప్రశ్నించారు.

"రోజులు బావులేవండీ బాబూ. యాక్సిడెంట్లయినా జరుగుతాయి, మర్డర్స్ అయినా జరుగుతాయి. ఉండండి చూసొస్తాను" అంటూ ఒక సిటీబస్సు కండక్టర్ జంక్షన్ వేపు పరిగెత్తాడు.

నేను ఫుట్‌పాత్ మీద నిలబడి జన సమూహం వేపు చూస్తున్నాను.

అయిదు నిమిషాల తర్వాత వెనక్కొచ్చిన ఆ కండక్టర్ బస్సెక్కుతూ- "నడిరోడ్లో ఇద్దరు ఆడాళ్ళు కొట్టుకు చస్తున్నారు. అది మనుషుల తగవులా లేదు. పిశాచాల తగవులా ఉంది. ఈ గొడవ ఎంతసేపుంటుందో, ఏవవుద్దో. పోలీసులొస్తే గానీ తెగేటట్టు లేదు." చెప్పాడతను.

సదరు ఆసక్తికరమైన కార్యక్రమాన్ని వీక్షించడానికి బస్సుల్లోని జనం కిందకు దిగిపోయి జంక్షన్ వేపు వెళ్తున్నారు.

నేనూ ముందుకు నడిచాను.

మసక మసక చీకటిలో, ఆ నాలుగు రోడ్ల జంక్షన్ వీధి నాటకానికి సిద్ధం చేసిన రంగస్థలంలా ఉంది.

ఆ జనరంగస్థలం మధ్యలో ఇద్దరు ఆడవాళ్ళు మసక మసగ్గా కనిపిస్తున్నారు. ఆ ఇద్దరు ఆడవాళ్ళు ఎంతసేపు కొట్టుకున్నారో తెలీదు.

వాళ్ళిద్దరూ అర్ధనగ్నంగా ఉన్నారు. వాళ్ళ చీర కొంగులు కిందకు వేలాడు తున్నాయి. వాళ్ళ జాకెట్లు చిరిగి పోయాయి. కొప్పులు ఊడిపోయాయి. పూలు రాలిపోయాయి. బొట్లు చెదిరి పోయాయి. గాజులు పగిలిపోయాయి.

"ఏవే ముసిలిదానా. ఆ గుంటడు నీ గుంటడా? నీకు పుట్టాడా? నువ్వు పెంచావా? ఎందుకే అలా తైతక్కలాడి పోతున్నావ్? నువ్వెవర్తి దగ్గర్నుంచో అద్దెకు తెస్తావ్. నాకిస్తావ్. నాను నా తెలివీ తేటల్తో, సదువుకున్న అమ్మాయిలా, పెద్దింటి అమ్మాయిలా ఏసం కట్టి, బస్సు రూటు, లారీ రూటు, సంతల కాడ, ఏదో రూటులో జనాలకి ఆణ్ణి సూపించి తండ్రి పోనాడని, ఈడికో పెద్ద రోగవుందని, ఆపరేషన్ సెయ్యాలని కతలల్లి, కన్నీళ్ళు కార్చి, ఆళ్ళందర్నీ నమ్మించి యాపారం సేసి, ఒప్పందం ప్రకారం ఆడి తల్లికి యాభై రూపాయలు, నీకు వంద రూపాయలు కచ్చితంగా ఇచ్చేస్తన్నానా, నేదా సెప్పు. ఇయ్యాలెందుకు గొడవ పెట్టేసినావో

